# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 12 నవంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## వరద బాధితుల కుటుంబాలకు రూ. 12.99 కోట్ల సాయం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

వరద బాధిత కుటుంబాలను ఆదు కునేందుకు తక్షణ సాయం కింద రూ.12.99 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ మంగళవారం ఉత్త ర్వులు విడుదల చేశారు. మొంథా తుపాను ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలు, వరదల్లో నష్టపోయిన కుటుంబాలకు తక్షణ సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలతో దెబ్బతిన్న ఇండ్లకు రూ.15 వేల చొప్పున సాయం అందించనున్నట్టు పేర్కొన్నారు. జిల్లాల కలెక్టర్లు పంపించిన నివేదికల ప్రకారం 15 జిల్లాల్లో 8,662 ఇండ్లు దెబ్బతిన్నాయని వివరించారు. వారికి తక్షణ సాయంగా రూ.12.99 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. ఈ నిధులను నేరుగా బాధిత కుటుంబాల బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామని పేర్కొన్నారు. గతనెల 27 నుంచి 30 వరకు వరుసగా నాలుగు రోజులపాటు రాష్ట్రంలోని 16 జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయని వివరించారు. వరంగల్, హన్మకొండ, వికారాబాద్, వనపర్తి, రంగారెడ్డి, కరీంనగర్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, యాదాద్రి భువనగిరి, సిద్ధిపేట, రాజన్న సిరిసిల్ల, ములుగు, మహబూబాబాద్, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని తెలిపారు.

# పేలుళ్ల కేసులో ముగ్గురు వైద్యుల అరెస్ట్

- 13కి చేరిన మృతుల సంఖ్య
- సమగ్ర దర్యాప్తు చేపట్టిన ఎన్ఐఏ
- కుట్ర పన్నిన ఎవరినీ వదలం : ప్రధాని మోడీ



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన దేశ రాజధాని ఢిల్లీలో ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుళ్లపై సమగ్ర దర్యాప్తును మంగళవారం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) చేపట్టింది. మరోవైపు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటికే రెండుసార్లు ఉన్నతస్థాయి భద్రతా సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని కోణాల్లో నుంచి దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. ఈ దారుణానికి బాధ్యులైన వారిని, కుట్ర పన్నిన వారిని ఎవరినీ వదిలిపెట్టేది లేదని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. మరోవైపు ఈ ఘటనలో మృతుల సంఖ్య 13కు చేరుకుంది. బాధితులకు రూ.10లక్షల నష్టపరిహారాన్ని ఢిల్లీ సీఎం రేఖా గుప్తా ప్రకటించారు. పేలుడు సంభవించిన కారులోని వ్యక్తిని పుల్వామా నివాసి డాక్టర్ ఉమర్‌గా భావిస్తున్నట్టు ప్రభుత్వ వర్గాలు హిందూ పత్రికకు తెలిపాయి. ఢిల్లీ పోలీసులు ఉపా కింద, పేలుళ్ల చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

**అదుపులో ముగ్గురు వైద్యులు**

ఢిల్లీ పేలుళ్ల ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో ఫరీదాబాద్ అల్ ఫలాహ్ యూనివర్సిటీ నుంచి మరో ముగ్గురు వైద్యులను అదుపులోకి తీసుకున్నారు. వారిని ముజామ్మిల్ షకీల్, ఉమర్ మహ్మద్, షాహీన్ షాహిద్‌లుగా గుర్తించారు. వీరిలో షాహిన్ లక్నోకు చెందిన వ్యక్తి కాగా మిగిలిన ఇద్దరు కాశ్మీర్‌కు చెందినవారు. వీరు ముగ్గురు కూడా ఫరీదాబాద్ ఆస్పత్రిలోనే పని చేస్తున్నారని దర్యాప్తు అధికారులు గుర్తించారు. పైగా యూనివర్సిటీ కమ్ ఆస్పత్రి అయిన ఆ సెంటర్‌లో వీరు సీనియర్ డాక్టర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఫరీదాబాద్‌లో 2900 కిలోల పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్న కేసులో ముజామ్మిల్ పేరు బయటకు వచ్చింది. ఫరీదాబాద్‌లో ముజామ్మిల్ అద్దెకు తీసుకున్న రెండు గదులనుంచి వీటిని స్వాధీనం చేసుకున్నారు. నిజానికి ముజామ్మిల్ యూనివర్సిటీ క్యాంపస్‌లోనే ఉంటున్నా ఈ గదులను అద్దెకు తీసుకున్నాడు. పైగా ముజామ్మిల్ సహచరునికి చెందిన కారు నుంచి రైఫిల్స్, మందుగుండు సామగ్రిని కూడా స్వాధీనం చేసుకున్నారు. జైషే మహ్మద్ మహిళా విభాగానికి భారత్‌లో ఒక బ్రాంచిని ఏర్పాటు చేసే బాధ్యతను షాహిన్‌కు అప్పగించినట్టు తెలుస్తోంది.

ఎర్రకోట మెట్రోస్టేషన్‌ను బుధవారం కూడా మూసివేస్తున్నట్టు ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ ప్రకటించింది. పేలుళ్ల నేపథ్యంలో భారత్-నేపాల్ సరిహద్దు వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.

ఢిల్లీ ఆత్మాహుతి దాడి అనుమానితుడుగా భావిస్తున్న డాక్టర్ ఉమర్ ఈ ఘటనకు ముందు మూడు రోజులుగా తన ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేసుకుని అజ్ఞాతంలో ఉన్నట్టు తెలుస్తోంది. పేలుడు జరిగిన ఐ 20 కారును చివరిగా కొనుగోలు చేసిన వ్యక్తి కూడా తనే అని అనుమానిస్తున్నారు. ఈ కారు ఉమర్ చేతికి రావడానికి ముందుగా అనేక చేతులు మారింది. ఈ ఘటనలో ఉపయోగించిన పేలుడు పదార్థాలు ఏమిటనేది తెలుసుకోవడానికి ఫోరెన్సిక్ నివేదిక కోసం వేచి ఉన్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఫరీదాబాద్‌లో పెద్దమొత్తంలో దొరికిన పేలుడు పదార్థాలకు, ఢిల్లీలో పేలుడుకు సంబంధం ఉందని భావిస్తున్నట్టు పోలీసు వర్గాలు తెలిపాయి.



ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుళ్లలో అమ్మోనియం నైట్రేట్, ఇంధన ఆయిల్, డిటోనేటర్లు వాడి ఉండొచ్చునని ప్రాథమిక నిర్ధారణలను బట్టి తెలుస్తోందని పోలీసులు చెబుతున్నారు.

అంగోలా పర్యటనలో ఉన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం అమిత్ షాతో ఫోన్‌లో మాట్లాడారు. ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు గురించి ఆరా తీశారు' అని సంబంధిత వర్గాలు తెలిపాయి.

**పెరిగిన మృతుల సంఖ్య**

ఢిల్లీలో ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుళ్లలో మృతి చెందిన వారి సంఖ్య 13కు చేరింది. గాయపడిన మరికొందరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ పేలుడు వెనుక ఉగ్రకుట్ర ఉందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

**ఎట్టి పరిస్థితుల్లోనూ వదలం..ప్రధాని మోడీ**

ఢిల్లీ ఎర్రకోట వద్ద కారు పేలుడుకు కారకులైన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదలబోమని ప్రధాని మోడీ వెల్లడించారు. నిందితులు ఎక్కడున్నా పట్టుకుని, కఠినంగా శిక్షిస్తామని తెలిపారు.

# బిహార్ పోలింగ్ ప్రశాంతం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

చెదురుమదురు ఘటనలు మినహా బిహార్‌లో రెండో విడత పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. సమయం ముగిసిన తర్వాత కూడా లైన్‌లో నిలిచిన ఓటర్లకు అధికారాలు ఓటు వేసే అవకాశాన్ని కల్పించారు. ఈ విడతలో 20 జిల్లాలకు చెందిన 122 నియోజకవర్గాల్లో 12 మంది మంత్రులు సహా మొత్తం 1302 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. దిల్లీ పేలుడు ఘటన నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేస్తూ 4 లక్షలకుపైగా భద్రతా సిబ్బందిని మోహరించారు. అంతర్జాతీయ సరిహద్దులను మూసివేయడం వంటి ముందు జాగ్రత్త చర్యలు కూడా చేపట్టారు. సాయంత్రం 5 గంటల వరకు మొత్తం 67.14% పోలింగ్ నమోదు అయినట్లు అధికారులు వెల్లడించారు.

మంగళవారం జరిగిన పోలింగ్‌లో కేంద్రమంత్రి సతీశ్ చంద్ర దూబే, బిహార్ మంత్రి నితీష్ మిశ్రా, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు దిలీప్ కుమార్ జైస్వాల్, జన్ సూరజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అరారియా జిల్లాలోని పోలింగ్



బూత్ వద్ద బీజేపీ%-%కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఓటర్లపై దాడి చేసేందుకు బీజేపీ ప్రయత్నించిందని కాంగ్రెస్ ఆరోపించింది.

పోలింగ్ జరుగుతున్న సమయంలో ఆర్‌జేడీ సోషల్ మీడియా పోస్టులు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించాయని బీజేపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఇందులోని వ్యాఖ్యలు ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే విధంగా ఉన్నాయని పేర్కొంది. జేడీయూ ఓటర్లను అడ్డుకున్నారని ఆర్‌జేడీ చేసిన పోస్టులను బీజేపీ ఖండించింది.

ఈ విడతతో ముఖ్యమంత్రి నీతీష్ కుమార్ కేబినెట్లోని 12 మంది మంత్రుల భవితవ్యం నిర్ణయించబడనుంది. తొలి విడతలో చరిత్రలోనే అత్యధికంగా 65.08% పోలింగ్ నమోదైన విషయం తెలిసిందే.

# జూబ్లీహిల్స్‌లో 48.47 శాతం ఓటింగ్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గానికి జరిగిన ఉపఎన్నిక పోలింగ్ ప్రక్రియ చెదురుమొదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. ఓటర్లు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో పోలింగ్ శాతం తక్కువగా నమోదైంది.

ఉదయం 7 గంటలకు 407 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రారంభమైంది. అయితే ఉదయం నుంచే పోలింగ్ మందకొడిగా సాగింది. కొన్నిచోట్ల వృద్ధులు, వికలాంగులు ఉత్సాహంగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తొలి రెండు గంటల్లో కేవలం 9.2 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఉదయం 11 గంటల వరకు.. పోలింగ్ శాతం కొద్దిగా పెరిగి 20.76 శాతానికి చేరుకుంది. ఈ సమయంలో పలువురు ప్రముఖులు, సినీ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, నటుడు తనికెళ్ల భరణి వంటి వారు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్, బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి తదితరులు ఉదయాన్నే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇదిలావుంటే మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ 31.94 శాతంగా నమోదవ్వగా.. 3గంటల వరకు పోలింగ్ శాతం 40.20కి చేరింది. సాయంత్రం 5 గంటల వరకు.. అంటే పోలింగ్ ముగియడానికి గంట ముందు నాటికి 47.16 శాతం ఓటింగ్ నమోదైంది. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ సమయం ముగిసింది. అయితే, క్యూ లైన్లలో ఉన్నవారికి ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు.

షేక్‌పేట్, రహమత్‌నగర్, వెంగళ్‌రావునగర్‌లోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో పోలింగ్ కాసేపు ఆలస్యమైంది. శ్రీనగర్ కాలనీలోని నాగార్జున కమ్యూనిటీ హాల్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా పోలింగ్ తాత్కాలికంగా నిలిచిపోయింది. యూసుఫ్‌గూడలోని సవేరా ఫంక్షన్ హాల్ వద్ద బీఆర్ఎస్ అభ్యర్థి సునీత, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. కాంగ్రెస్ నాయకులు ఓటర్లను ప్రభావితం చేస్తూ, కరపత్రాలు పంచుతున్నారని సునీత ఆరోపించారు. ఇరువర్గాలు పరస్పరం నినాదాలు చేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఇక వెంగళ్ రావు నగర్ డివిజన్‌లోని 120వ పోలింగ్ బూత్ వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు దొంగ ఓట్లు వేయిస్తున్నారని ఆరోపించుకుంటూ బాహాబాహీకి దిగారు. దీంతో పోలింగ్ కేంద్రం వద్ద కొద్దిసేపు గందరగోళం నెలకొంది. షేక్‌పేట్ డివిజన్‌లోని అపెక్స్ హైస్కూల్ వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట జరగడంతో పోలీసులు లాఠీలతో చెదరగొట్టారు. రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలోని అనేక ప్రాంతాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఓటుకు రూ. 2000 నుంచి రూ. 5000 వరకు పంపిణీ చేశాయని పరస్పరం ఆరోపించుకున్నాయి. ఈసీ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. సమస్యాత్మక కేంద్రాల్లో కేంద్ర బలగాలను మోహరించింది. దేశంలోనే తొలిసారిగా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నియోజకవర్గంలో ఉన్న స్థానికేతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ ప్రక్రియ ఉద్రిక్తతల నడుమ ముగిసింది.

# అశ్రునయనాల మధ్య అందెశ్రీ అంత్యక్రియలు

- ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహణ
- పాడె మోసిన సీఎం రేవంత్‌రెడ్డి

**అందె శ్రీకి పద్మ శ్రీ ఇవ్వాలి : సీఎం**



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ అంత్యక్రియలు పూర్తయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం తరపున పోలీసు గౌరవ వందనంతో లాంఛనంగా నిర్వహించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కన ఉన్న స్మృతి వనంలో నిర్వహించిన అంతిమ సంస్కారాలకు సీఎం రేవంత్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. వేలాదిగా తరలి వచ్చిన అభిమానులు, సాహితీప్రియులు అక్షర యోధుడికి కడసారి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా అందెశ్రీ పాడెను ముఖ్యమంత్రి మోశారు. అందెశ్రీ గుండెపోటుతో సోమవారం మృతి చెందగా, ఆయన అంతిమ యాత్రను మంగళవారం లాలాపేట జయశంకర్ స్టేడియం నుంచి తార్నాక, ఉప్పల్, మీదుగా ఘట్కేసర్ మున్సిపాల్టీలోని ఎన్ఎస్‌పీ నగర్‌లో అందెశ్రీ నూతనంగా నిర్మించుకుంటున్న ఇంటి వరకు సాగింది. అంబేద్కర్ కూడలి వద్ద కొంతమంది రాజకీయ నాయకులు సంతాపం తెలిపారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ఉన్న స్మృతి వనం వరకు అంతిమయాత్ర సాగింది. ఈ సందర్భంగా ప్రముఖులు పూలతో అందెశ్రీకి ఘనంగా నివాళ్లర్పించారు. అందెశ్రీ సతీమణి మల్లుబాయి, కుమార్తెలు వాక్కులమ్మ, వెన్నెల, వేకువ, కుమారుడు దత్తు సాంప్రదాయ పద్ధతిలో కర్మకాండలు నిర్వహించారు.

**అందెశ్రీకి పద్మ శ్రీ ఇవ్వాలి : సీఎం రేవంత్‌రెడ్డి**

ప్రముఖ కవి, రచయిత అందెశ్రీని కోల్పోవడం తెలంగాణకు తీరని నష్టమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తన గళాన్ని, కలాన్ని తెలంగాణ సమాజానికే అంకితమిచ్చిన అందెశ్రీ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు. ఆయన రచించిన జయజయహే తెలంగాణ పాటను పాఠ్యాంశంగా తీసుకొస్తామని తెలిపారు. అందెశ్రీ అంత్యక్రియల్లో పాల్గొన్న అనంతరం సీఎం మాట్లాడారు. అందెశ్రీ రచనలను పుస్తక రూపంలో తీసుకొస్తామని చెప్పారు. అందెశ్రీ నిప్పుల వాగు పుస్తకం ఒక గైడ్ అన్నారు. అందెశ్రీ రచనలు అన్ని లైబ్రరీల్లో ఉండేలా చర్యలు తీసుకుంటామనీ, ఆయన పేరు, స్ఫూర్తి శాశత్వంగా ఉండేలా చూస్తామన్నారు. అందెశ్రీ చివరి వరకు సాధారణ జీవితం గడిపారన్నారు. తన పాటతో తెలంగాణ ఉద్యమాన్ని ఒక్కటిగా నడిపించారని కొనియాడారు. అందెశ్రీ పాట, మాట గొప్ప స్ఫూర్తినిచ్చిందనీ, ఎన్నో సందర్భాల్లో ఇద్దరం కలిసి అనేక కీలక అంశాలపై చర్చించామని గుర్తు చేసుకున్నారు. గద్దర్‌తో పాటు అందెశ్రీ తెలంగాణ ఉద్యమానికి ఎంతో బలాన్నిచ్చారన్నారు. అందెశ్రీ జయజయహే పాట తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి నింపిందనీ, ఈ పాటను రాష్ట్ర గీతంగా గుర్తించామని తెలిపారు. అందెశ్రీ పేరుతో ఒక స్మృతి వనాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలని గతేడాది కేంద్రానికి లేఖ రాసినా అవార్డు రాలేదన్నారు. ఈ ఏడాది కూడా మరోసారి లేఖ రాస్తామనీ, అందెశ్రీకి పద్మశ్రీ గౌరవం దక్కేలా కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి సహకరించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలుగా అందెశ్రీని పద్మశ్రీతో గౌరవించుకునేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఆయన రాసిన "జయ జయహే తెలంగాణ" గీతాన్ని పాఠ్యాంశంగా చేర్చేందుకు మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అందెశ్రీ పాటల సంకలనం "నిప్పుల వాగు" ఒక భగవద్గీతగా, బైబిల్‌గా, ఖురాన్‌గా తెలంగాణ సమస్యలపై పోరాడే వారికి గైడ్‌గా ఉపయోగపడుతుందని తెలిపారు. 20 వేల నిప్పుల వాగు పుస్తకాలను ముద్రించి తెలంగాణలోని ప్రతీ లైబ్రరీలో అందుబాటులో ఉంచుతామన్నారు.

అందెశ్రీ అంతక్రియల్లో రాష్ట్ర మంత్రులు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, జూపల్లి కష్ణారావు, పొన్నం ప్రభాకర్, ధనసరి అనసూయ సీతక్క, పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు కె.కేశవరావు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీలు కోదండరాం, తీన్మార్ మల్లన్న, మాజీ కేంద్రమంత్రి సర్వే సత్యనారాయణ, మాజీ ఎంపీ హనుమంతరావు, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ వ్యవసాయ సదస్సుకు కోనరావుపేట రైతులు..

- స్థిరమైన వ్యవసాయంలో నవకల్పనలకు

**రాజన్న సిరిసిల్ల జిల్లాకు అరుదైన గౌరవం**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

తెలంగాణ రైతు సమాజానికి గర్వకారణమైన ఘట్టమిది! రాజన్న సిరిసిల్ల జిల్లా, కోనరావుపేట మండలానికి చెందిన ముగ్గురు రైతులు జర్మనీలో జరిగే ప్రతిష్టాత్మక అంతర్జాతీయ వ్యవసాయ సదస్సు (Agriculture Summit 2025) లో పాల్గొనేందుకు ఆహ్వానం అందుకున్నారు. సుప్రసిద్ధ ఫ్రాన్‌హోఫర్ సంస్థ ఈ సదస్సును నిర్వహిస్తోంది.ఈ ప్రపంచ సదస్సులో ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు, సుస్థిర సాగు విధానాలలో వస్తున్న విప్లవాత్మక మార్పులు, ఆవిష్కరణలపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులు, మార్గదర్శకులు చర్చించనున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిని సాధించే వ్యవసాయ నవకల్పనలను ప్రోత్సహించే ACRAT Project India కింద అద్భుతమైన ప్రతిభ కనబరిచినందుకు గాను ఈ ముగ్గురు రైతులు ఎంపికయ్యారు.

ఎంపికైన రైతులు కాతుబండ శ్రీనివాస్ (మామిడిపెల్లి), కాటిపెల్లి వేణు (మామిడిపెల్లి), దూంపేట నాగరాజు (నాగారం) టెక్నాలజీని అందిపుచ్చుకుని, ఫలితాలు రాబట్టి సాంప్రదాయ వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను సమన్వయం చేయడంలో పేరుగాంచిన ఈ రైతుల బృందం, శాస్త్రీయ పంట ప్రణాళిక, సమర్థవంతమైన వనరుల నిర్వహణ ద్వారా పరిమిత పెట్టుబడితో కూడా అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని నిరూపించింది. ఈ రైతులు తమ అనుభవాలను అంతర్జాతీయ వేదికపై పంచుకోవడంతో పాటు, ప్రెసిషన్ అగ్రికల్చర్, స్మార్ట్ ఇరిగేషన్, వాతావరణాన్ని తట్టుకునే సాగు పద్ధతుల వంటి ప్రపంచ పోకడలపై జ్ఞానాన్ని పొందడానికి సోమవారం రోజున జర్మనీకి బయలుదేరారు.

తెలంగాణ అగ్రిటెక్ స్ఫూర్తికి గుర్తింపు వీరి ఎంపిక పట్ల జిల్లా వ్యవసాయ అధికారులు, తోటి రైతులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. "ఈ గుర్తింపు వారి కష్టానికి దక్కిన గౌరవమే కాకుండా, తెలంగాణ యొక్క వినూత్న వ్యవసాయ పద్ధతులను ప్రపంచ పటంలో నిలబెట్టింది" అని అధికారులు తెలిపారు.

సాంకేతిక వ్యవసాయానికి మార్గదర్శకంగా ACRAT ప్రాజెక్టు.. బెర్లిన్ (జర్మనీ) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలవుతున్న ACRAT (Accelerating Climate Resilient Agricultural Transformation) ప్రాజెక్టు లో భాగంగా, రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలానికి చెందిన రైతులు మామిడిపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ వేణుగోపాల్ రెడ్డి నాగారం గ్రామానికి చెందిన దుంపేట నాగరాజు జర్మనీలో నిర్వహించిన ప్రపంచ వ్యవసాయ సమ్మిట్ మరియు Agritechnica 2025 ప్రదర్శనల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భవిష్యత్తులో రసాయన ఎరువులు వినియోగించకుండా, కృత్రిమ మేధస్సు టెక్నాలజీ, స్మార్ట్ అగ్రికల్చర్ పద్ధతులు మరియు డిజిటల్ వ్యవసాయ పరికరాలు వినియోగించి దిగుబడిని మరింత పెంచాలని సంకల్పించామని తెలిపారు.

వాతావరణ మార్పులకు అనుగుణంగా సాంకేతిక వ్యవసాయం అనుసంధానం చేయడం ద్వారానే రైతుల ఆదాయం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలో రైతులతో పాటు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ప్రత్యేకంగా ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో సేవ్స్ ) స్వచ్ఛంద సంస్థ కీలక పాత్ర పోషించింది. రైతుల ఎంపిక, శిక్షణ, మరియు అంతర్జాతీయ సమన్వయంలో సేవ్స్ ఎన్జీవో ప్రధాన భాగస్వామ్యాన్ని నిర్వహించింది. జర్మనీలో తెలుగు రైతుల సాంకేతిక అవగాహన, భవిష్యత్ దృష్టి, మరియు పర్యావరణానుకూల వ్యవసాయ విధానాలు ప్రపంచ వ్యవసాయ నిపుణులను ఆకట్టుకున్నాయి.


# ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు రూ.202.93 కోట్ల విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు బిల్లుల రూపేణా ఈ వారంలో రూ.202.90 కోట్లను విడుదల చేశారు. ఇండ్ల నిర్మాణపు పనుల దశలను బట్టి విడుదల చేయాల్సిన బిల్లు మొత్తాలను ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ ప్రక్రియలో భాగంగా నవంబరు 11న పురోగతి సాధించిన మేరకు 18,247 మంది లబ్దిదారులకు బిల్లులను విడుదల చేసినట్టు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి.గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారం లబ్దిదారులకు చేసిన చెల్లింపుల్లో బేస్ మెంట్ లెవల్ నిర్మాణాలు 4,615, రూఫ్ లెవల్ (గోడలు పూర్తి) అయినవి 8,517, శ్లాబ్ వేసినవి 5,115 ఇండ్లు ఉన్నాయని వివరించారు.

**మొత్తం రూ.2900 కోట్ల చెల్లింపు**

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇప్పటి వరకు మొత్తం రూ.2,900.35 కోట్లను చెల్లించారు. వీటిలో బేస్ మెంట్ లెవల్ (బీఎల్) దాటిన ఇండ్లకు రూ.1,610.79 కోట్లు, రూఫ్ లెవల్ (ఆర్ఎల్) రూ.716.91 కోట్లు, రూఫ్ క్యాస్టెడ్ (శ్లాబ్ పూర్తి-ఆర్‌సీ) అయిన ఇండ్లకు రూ.572.65 కోట్లను లబ్ధిదా రుల ఖాతాల్లో జమ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంతవరకు 2,33,069 ఇండ్ల పనులు ప్రారంభం కాగా, వాటిలో బేస్‌మెంట్ (బీఎల్) స్థాయిలో 90,613, గోడల నిర్మాణం పూర్తి అయిన స్థాయిలో (ఆర్ఎల్) 41,212 ఇండ్లు, శ్లాబ్ పూర్తి (ఆర్‌సీ) అయినవి 37,400 ఇండ్లు ఉన్నాయని గౌతం తెలిపారు.




## కోడ్ ఉల్లంఘనలపై సీఈఓకు బీఆర్ఎస్ ఫిర్యాదు

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులపై బీఆర్ఎస్ పార్టీ తరపున ఒక ప్రతినిధి బృందం బీఆర్‌కే భవన్‌లోని ముఖ్య ఎన్నికల అధికారికి మంగళవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. మాజీ కార్పొరేషన్ చైర్మన్ డా.దూదిమెట్ల బాలరాజు యాదవ్ మరియు మాజీ బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ నాయకత్వంలో ఈ ఫిర్యాదు అందించబడింది. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తూ, ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని బీఆర్ఎస్ ప్రతినిధులు ఆరోపించారు. ఈ ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని బీఆర్ఎస్ నేతలు సీఈఓను కోరారు. ఈ ఫిర్యాదు కార్యక్రమంలో డా.దూదిమెట్ల బాలరాజు యాదవ్, శుభప్రద్ పటేల్‌తో పాటు, మరో మాజీ బీసీ కమిషన్ సభ్యులు ఉపేంద్రా చారి, బీఆర్ఎస్ పార్టీ నేతలు ఎంఎన్ శ్రీనివాస్, జక్కుల లక్ష్మణ్, నిరోష లు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయంలో సామూహిక కార్తీక దీపోత్సవం ప్రారంభం





**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు తేది: 22-10-2025 (బుధవారం) నుండి తేది: 20-11-2025 (గురువారం) వరకు సామూహిక కార్తీక దీపోత్సవం కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం 21వ రోజు భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జ్యోతి ప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా ప్రారంభించారు. ఏఈఓ గోవిందుల అశోక్ కుమార్ భీమేశ్వర స్వామి ఆలయ దేవాలయంలో సేవా సమితి సభ్యులు భక్తి గీతాలు, భజనలతో భక్తులను అలరించారు. కార్తీక మాస పర్వదినాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ సామూహిక కార్తీక దీపోత్సవ కార్యక్రమం ప్రతి రోజూ సాయంత్రం 6:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు సుహాసినీల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించబడుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుహాసినీలకు ఆలయ అర్చకులు మరియు ఆలయ ఉద్యోగులు చేతుల మీదుగా వాయనం పసుపు కుంకుమ అక్షింతలు గాజులు స్వామివారి ఫోటోను అందజేయడం జరిగినది వారి వెంట సీనియర్ అసిస్టెంట్లు తక్కనపల్లి రాజేశ్వరరావు, ఎడ్ల శివ సాయి, జూనియర్ అసిస్టెంట్ నరాల రాజు, శ్రీ రాజరాజేశ్వర సేవా సమితి మరియు ఆలయ ఉద్యోగులు వేద పండితులు ఉన్నారు.

# డిండి నిర్వాసితులకు అండగా ఉంటా..

- **తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

**బలగం టీవీ, నల్గొండ**

నల్గొండ జిల్లాలో డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పరిధిలోని కిష్టరాయినిపల్లి, శివన్నగూడెం రిజర్వాయర్ల నిర్వాసితులను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మంగళవారం 'జనంబాట' కార్యక్రమంలో భాగంగా సందర్శించి, వారి సమస్యలను ఆలకించారు. తమ గోడు చెప్పుకుంటూ కన్నీళ్లు పెట్టుకున్న బాధితులకు ఆమె తప్పకుండా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తయితే వేలాది మందికి లాభం జరుగుతుందనే ఉద్దేశంతో ప్రజలు పెద్ద మనసు చేసుకొని తమ భూములను ఇచ్చారు. 2015 లోనే ప్రాజెక్టు పూర్తై ఉంటే ఈ సమస్యలు ఉండేవి కావు. ప్రాజెక్టు దాదాపు 11 ఏళ్లు ఆలస్యం అయింది. దీంతో అప్పుడు 18 ఏళ్లు నిండని చాలా మందికి ఇప్పుడు 18 ఏళ్లు దాటాయి. వారికి కూడా పరిహారం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అప్పుడున్న ధరలకు, ఇప్పుడున్న ధరలకు చాలా తేడా ఉంది. నిర్వాసితులకు ఇండ్లు గానీ, వేరే కాలనీలు గానీ కట్టించలేదు. ప్రజలను వారికి కట్టించిన ఇళ్లలో దిగబెట్టే వరకు నెల నెల ఖర్చు (భత్యం) ఇవ్వాలని చట్టంలో ఉందని గుర్తు చేశారు. ఈ నాలుగు అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకే ఇక్కడికి



వచ్చానని స్పష్టం చేశారు.

గతంలో మునుగోడు ఎన్నికలు జరిగినప్పుడు, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి న్యాయం చేస్తానని మాట ఇచ్చి, ఇప్పుడు అడిగితే పట్టించుకోవటం లేదని బాధితులు చెబుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సైతం న్యాయం చేస్తానని మాట ఇచ్చి, మిడ్ మానేర్, మల్లన్న సాగర్ నిర్వాసితులకు న్యాయం చేసినట్లు చేస్తానని, ఎకరాకు రూ. 25 లక్షలు ఇప్పిస్తానని చెప్పినా, ఇప్పుడు పట్టించుకోవటం లేదని విమర్శించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడగా, 4 నెలలుగా ఈ ప్రభుత్వం వారికి డబ్బులు ఇవ్వకపోవడంతో పనులు ఆపివేశారని తెలిపారు. దీనివల్ల ప్రాజెక్టు మరింత ఆలస్యమయ్యే పరిస్థితి ఉంది.

ప్రభుత్వం ఆలస్యం చేస్తున్న కొద్దీ నష్టం ఎక్కువ అవుతోంది. ఇదివరకు రైతులుగా ఉన్నవారు కూలీలు అయ్యారని చెప్పడం బాధాకరం. ప్రభుత్వాన్ని పదే పదే అడిగి ఒత్తిడి తేవాల్సిన అవసరముంది. తాను రావటం వలన రెండు రూపాయలు లాభం జరిగినా తన జన్మ ధన్యమైనట్లే అన్నారు. ఇళ్ల స్థలాల కోసం (ఇబ్రహీంపట్నం, చింతపల్లి) ఒక తారీఖు అనుకొని నల్గొండలో లేదంటే హైదరాబాద్‌లో ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. వెంటనే నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే యువతతో కలిసి హైదరాబాద్‌లో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు.

## మౌలానా అబుల్ కలామ్ ఆజాద్‌కు సీఎం నివాళులు..

**బలగం టీవీ, హైదరాబాద్**



స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యా శాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆ మహనీయునికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా, మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి రోజున జరుపుకునే జాతీయ విద్యా దినోత్సవం మరియు మైనారిటీ సంక్షేమ దినోత్సవం పురస్కరించుకుని ముఖ్యమంత్రి శుభాభినందనలు తెలియజేశారు. విద్యా రంగంలో, అలాగే మైనారిటీ సంక్షేమ రంగంలో విశేష సేవలు అందిస్తున్న వారందరికీ ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. దేశ నిర్మాణంలో, విద్యారంగ అభివృద్ధిలో అబుల్ కలామ్ ఆజాద్ అందించిన సేవలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు.



## కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై కేసు నమోదు చేసిన పోలీసులు..

**బలగం టీవీ, హైదరాబాద్**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఆరోపణలపై పోలీసులు ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై కేసు నమోదు చేశారు. మధురానగర్ పోలీసులు మంగళవారం (నవంబర్ 11) ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్ర నాయక్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉప ఎన్నిక జరగనున్న నేపథ్యంలో ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని ఆరోపిస్తూ పోలీసులు కేసు ఫైల్ చేశారు.

# ఓటర్లను కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నారు

- **13వ తేదీ వరకు ఎన్ని కుట్రలు చేస్తారో చేయండి**
- **14వ తేదీ నేను గెలిచాక అందరి అసలు రంగులు బయట పెడతా**
- **బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఓటర్లను కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నారని బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మహిళ అభ్యర్థి అనే గౌరవం కూడా ఇవ్వకుండా బూతులు మాట్లాడే స్థాయికి కాంగ్రెస్ కార్యకర్తలు దిగజారిపోయారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. స్టేట్‌లో ఉన్న ఆకు రౌడీలంతా ఇప్పుడంతా జూబ్లీహిల్స్‌లోనే తిరుగుతున్నారంటూ ఆమె వ్యాఖ్యానించారు. ఓటర్లు కాంగ్రెస్ గూండాల బెదిరింపులకు భయపడవద్దని సూచించిన ఆమె, విజ్ఞతతో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుందని, అందుకే ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని మాగంటి ఆరోపించారు. సురేశ్ యాదవ్ అనే వ్యక్తి అడ్డగోలుగా ప్రవర్తిస్తున్నాడని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కొంతమంది మంత్రులు ఇక్కడ తిరగాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు.

పోలింగ్ కేంద్రాల్లో బీఆర్ఎస్ ఏజెంట్లను కూర్చోనివ్వకుండా



అడ్డుకోవడం, బూత్‌లలోని టేబుళ్లను బయటపడేయడం, పోలీసులే టేబుళ్లు–చైర్లు లాక్కొని దౌర్జన్యం చేయడం జరుగుతోందని మాగంటి వాపోయారు. బిర్యానీ ప్యాకెట్లలో డబ్బులు పెట్టి ఓటర్లకు పంచుతున్నా కూడా పోలీసులు కనుగొన్నా చర్యలు తీసుకోవడం లేదని ఆమె విమర్శించారు. కొన్ని బూత్‌లలో రిగ్గింగ్ జరుగుతోందని, వికలాంగులకు సరిపడా వీల్‌చైర్లు కూడా ఏర్పాటు చేయలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రజియా అనే యువతి ఇంటికే వెళ్లి దాడులకు దిగుతున్నారని కూడా మాగంటి ఆరోపించారు. "నవీన్ యాదవ్ మనుషులు వచ్చి నన్నే బెదిరిస్తున్నారు. 13వ తేదీ వరకు ఎన్ని కుట్రలు చేస్తారో చేయండి. 14వ తేదీ నేను గెలిచాక అందరి అసలు రంగులు బయట పెడతాను" అని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ప్రజలకు తమ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాగంటి సునీత హామీ ఇచ్చారు.


## భార్య వేధింపులు తట్టుకోలేక భర్త ఆత్మహత్య

**బలగం టీవీ, బెంగళూరు**

బెంగళూరులో గిరినగర్‌లో నివసిస్తున్న యువ దంపతుల మధ్య నెలకొన్న కుటుంబ కలహాలు విషాదాంతానికి దారితీశాయి. భార్య తరఫున జరుగుతున్న వేధింపులు తట్టుకోలేక భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గగన్–మేఘన దంపతులకు కేవలం ఎనిమిది నెలల క్రితమే వివాహం జరిగింది. పెద్దలు కుదిర్చిన పెళ్లైనా ఇద్దరూ త్వరగానే కలసి పోయారు. ప్రీ–వెడ్డింగ్ షూట్‌లోనూ ప్రేమికుల్లా మమేకమై, కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా పెళ్లి చేసుకున్నారు. అయితే, నూతన వధూవరుల అన్యోన్యత ఎక్కువ కాలం నిలవలేదు. ఉద్యోగరీత్యా బెంగళూరులోనే నివసిస్తున్న ఈ జంటకు పెద్దల మార్గదర్శకం లేకపోవడంతో చిన్నచిన్న అపార్థాలు పెద్ద గొడవలుగా మారాయి. గగన్ బ్యాంకు ఉద్యోగి కావడం, పని ఒత్తిళ్లు ఉండడంతో దంపతుల మధ్య ఇగో సమస్యలు పెరిగినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. గగన్‌కు వేరే మహిళతో వివాహేతర సంబంధం ఉందని మేఘన అనుమానించడం పరిస్థితిని మరింత విషమం చేసింది. ఒక దశలో మేఘన అలిగి పుట్టింటికి వెళ్లింది. ఆమె తల్లిదండ్రులు మధ్యవర్తిత్వం చేసి మళ్లీ దంపతులను కలిపినా, కలిసి ఉన్న కొద్దికాలంలోనే గొడవలు మళ్లీ చెలరేగాయి. భార్య అనుమానాలు, ఆమె వైఖరి వల్ల మానసికంగా తీవ్రంగా బాధపడిన గగన్ చివరికి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు షాక్‌కు గురయ్యారు. కోడలి నిరంతర వేధింపుల వల్లే తమ కుమారుడు బలవన్మరణానికి పాల్పడ్డాడని గగన్ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## ఇస్లామాబాద్‌లో కారు పేలుడు: 12 మంది మృతి

**బలగం టీవీ, ఇస్లామాబాద్**




పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో భారీ పేలుడు సంభవించి ఆ ప్రాంతమంతా భయాందోళనకు గురైంది. మంగళవారం స్థానిక కోర్టు సమీపంలో నిల్పిన ఒక కారు ఒక్కసారిగా పేలిపోవడంతో భారీ శబ్దం వినిపించింది. వెంటనే అల్లకల్లోలం చెలరేగింది. ఈ ఘటనలో 12 మంది మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారని అధికారులు ధృవీకరించారు. క్షతగాత్రుల్లో ఎక్కువగా కోర్టు పనుల నిమిత్తం వచ్చిన వారే ఉన్నట్లు ప్రాథమిక సమాచారం వెల్లడిస్తోంది. పేలుడు ప్రభావంతో దగ్గర్లో పార్కింగ్‌లో ఉన్న అనేక వాహనాలు ధ్వంసమయ్యాయి. కారులో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలిన కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానిక మీడియా ప్రచురించినా, పోలీసులు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయకపోవడం గమనార్హం

ఇటీవలే ఆఫ్ఘన్ సరిహద్దుకు సమీపంలోని ఖైబర్ పఖ్తున్‌క్వా రాష్ట్రంలో ఉన్న వానా నగరంలోని ఆర్మీ కళాశాల క్యాంపస్‌లో క్యాడెట్లను బందీలుగా తీసుకునే ప్రయత్నం ఉగ్రవాదులు చేశారు. పాకిస్తాన్ దళాలు వెంటనే స్పందించి ఆ కుట్రను భగ్నం చేశాయి. ఈ సంఘటన తరువాత తక్కువ గ్యాప్‌లోనే ఇస్లామాబాద్‌లో జరిగిన ఈ పేలుడు అక్కడి భద్రతా పరిస్థితులపై ప్రశ్నార్థకాలు రేపుతోంది. వానా ప్రాంతం చాలా కాలంగా తాలిబాన్, అల్–ఖైదా తదితర తీవ్రవాద గ్రూపుల కేంద్రంగా ఉన్నట్టు విదేశీ భద్రతా వర్గాలు కూడా పేర్కొంటున్నాయి. సోమవారం సాయంత్రం ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడు ఇంకా ప్రజలు మరిచిపోకముందే, పాకిస్తాన్‌లోనూ వరుసగా పేలుళ్లు చోటుచేసుకోవడం ఆందోళనకు గురిచేస్తోంది. భద్రతా దళాలు ఇరువైపులా అప్రమత్తతను పెంచాయి.

## తెలంగాణలో చలి విజృంభణ

**బలగం టీవీ, హైదరాబాద్**



తెలంగాణలో రోజురోజుకు చలి తీవ్రత పెరిగిపోతోంది. సోమవారం వరకు డబుల్ డిజిట్ ఉష్ణోగ్రతలు కనిపించగా మంగళవారం ఏకంగా సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. కొమురంభీం అసిఫాబాద్ జిల్లాల్లో మంగళవారం 8.7 డిగ్రీల సెల్సియల్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో 10.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. అంతే కాకుండా నిర్మల్‌లో 11.7 డ్రీగ్రీలు, కామారెడ్డిలో 12 డిగ్రీలు, సంగారెడ్డిలో 12 డిగ్రీలు, మెదక్ రంగారెడ్డి సంగారెడ్డి జిల్లాల్లో 13 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక హైదరాబాద్‌లోనూ చలి కుమ్మేస్తోంది. నగరంలోని హెచ్సీయూ శేర్‌లింగంపల్లిలో 13.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాజేంద్రనగర్‌లో 14.7 డిగ్రీలు, గచ్చిబౌలిలో 15 డిగ్రీలు, మారేడ్పల్లిలో 15.2 డిగ్రీలు, గాజులరామారంలో 15.7 డిగ్రీలు, నేరేడ్మెట్‌లో 15.9 డిగ్రీలు, బేగంపేట్‌లో 16.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో చలితీవ్రత పెరగటంతో వృద్ధులు, చిన్నపిల్లు రాత్రి, తెల్లవారుజామున బయటకు రాకుండా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

## కీసరలో హిజ్రాల దాడితో కలకలం

**బలగం టీవీ, హైదరాబాద్**

కీసర మండలం చీర్యాల్‌లో కొత్త ఇల్లు కట్టుకుని గృహప్రవేశం చేసుకున్న కుటుంబంపై హిజ్రాల గుంపు దాడి చేసిన ఘటన ఉద్రిక్తతకు దారితీసింది. డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేసి, నిరాకరించడంతో అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా, తర్వాత గుంపుగా తిరిగి వచ్చి దాడికి పాల్పడటం స్థానికుల్లో ఆగ్రహాన్ని రేపింది. చీర్యాల్‌లోని శ్రీ బాలాజీ ఎంక్లేవ్‌లో నివసించే ప్రమిదల సదానందం ఇటీవల కొత్త ఇల్లు నిర్మించి బంధుమిత్రుల సమక్షంలో గృహప్రవేశం నిర్వహించాడు. ఆదివారం ఇంటిముందు పనులు చూసుకుంటుండగా ఇద్దరు హిజ్రాలు అక్కడకు చేరుకుని కొత్త ఇంటి పేరుతో డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సదానందం కొంత మొత్తం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా, వారు రూ. లక్ష ఇవ్వాలని పట్టుబట్టారు. అంత మొత్తం ఇవ్వలేమని కుటుంబసభ్యులు చెప్పడంతో హిజ్రాలు అసభ్యంగా దూషించి వెళ్లిపోయారు. కొద్ది సేపటికే మూడు ఆటోల్లో దాదాపు 15 మంది హిజ్రాలు మళ్లీ అక్కడికి చేరుకున్నారు. ఇంటి గేటును ధ్వంసం చేసేలా ప్రయత్నించి, శబ్దం వినిపించడంతో బయటకు వచ్చిన సదానందం కుటుంబసభ్యులపై కర్రలు, రాళ్లతో విరుచుకుపడ్డారు. వారి కేకలు విని చుట్టుపక్కల వారు చేరుకోగానే హిజ్రాల గుంపు అక్కడి నుంచి పారిపోయింది. దాడిలో గాయపడిన సదానందం ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం కీసర పోలీస స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేశాడు. హిజ్రాల ఆగడాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, పోలీసులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

# చలికాలం వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి..

- డీఎంహెచ్ఓ డా. రజిత

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**




చలికాలం వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ రజిత అన్నారు. సీజనల్ వ్యాధులలో భాగంగా వాతావరణంలో మార్పు ఉష్ణోగ్రతలు 16 డిగ్రీలకు పడిపోవడంతో చలి తీవ్రత పెరుగుతున్నందున రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, దీర్ఘకాల వ్యాధిగ్రస్తులు, 60 సంవత్సరాలు పైబడిన వారు, చిన్నపిల్లలు దగ్గు, జలుబు, ఆయాసం తో బాధపడే అవకాశము ఉన్నందున చలిని తట్టుకునేందుకు ఉన్ని దుస్తులు, స్వెటర్లు, మంకీ క్యాప్ ను ధరించాలని, చలికాలంలో ఎక్కువగా జలుబు, దగ్గు, ఆయాసం, (ఊపిరితిత్తుల) నిమోనియా లాంటి వ్యాధులు వైరస్ వల్ల ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని, గుండె సంబంధిత వ్యాధితో బాధపడేవారు చలిలో తిరగకుండా మాస్కులు ధరించి జాగ్రత్త వహించాల్సిందిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సిరిసిల్ల జిల్లా ప్రజలకు ఈ సందర్భంగా తెలియజేసినారు. సీజనల్ వ్యాధులలో భాగంగా, రాజన్న సిరిసిల్ల జిల్లాలో వాతావరణంలో మార్పులు సంభవించి, ఉష్ణోగ్రతలు 16 డిగ్రీలకు పడిపోవడంతో చలి తీవ్రత పెరిగింది. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ రజిత ప్రజలను అప్రమత్తం చేస్తూ కీలక సూచనలు జారీ చేశారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, 60 సంవత్సరాలు పైబడిన వారు, చిన్న పిల్లలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఈ వర్గాల ప్రజలు చలి తీవ్రత వల్ల దగ్గు, జలుబు, ఆయాసంతో బాధపడే అవకాశం ఉన్నందున, చలిని తట్టుకునేందుకు ఉన్ని దుస్తులు, స్వెటర్లు, మంకీ క్యాప్‌లను తప్పక ధరించాలని ఆమె సూచించారు. చలికాలంలో ఎక్కువగా జలుబు, దగ్గు, ఆయాసం, ఊపిరితిత్తుల (నిమోనియా) లాంటి వ్యాధులు వైరస్ కారణంగా ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా, గుండె సంబంధిత వ్యాధితో బాధపడేవారు చలిలో తిరగకుండా, బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా మాస్కులు ధరించి తగిన జాగ్రత్తలు వహించాలని డాక్టర్ రజిత సిరిసిల్ల జిల్లా ప్రజలకు ఈ సందర్భంగా తెలియజేశారు.



# డ్రంకన్ డ్రైవ్ లో పట్టుబడిన 77 మందికి జరిమానాలు..

- మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష, జరిమానా తప్పదు
- సిరిసిల్ల పట్టణ ఇన్‌స్పెక్టర్ కృష్ణ

**బలగం టీవీ, సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్ ఆదేశాల మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 77 మంది మందు బాబులు పట్టుబడగా వారిని సిరిసిల్ల పట్టణ పోలీసులు మంగళవారం రోజున కోర్టులో ప్రవేశపెట్టగా 77 మంది మందు బాబులకు జరిమానాలు విధిస్తు మేజిస్ట్రేట్ జయశ్రీ తీర్పు వెల్లడించినట్లు టౌన్ ఇన్స్పెక్టర్ కృష్ణ తెలిపారు. ముగ్గురికి ఒక్కొక్కరికి 6000/- రూపాయలు జరిమానా, 25 మందికి ఒక్కోక్కరికి 5000/- రూపాయల జరిమాన, ఇద్దరికి ఒక్కొక్కరికి 1500/- రూపాయల జరిమాన, 47 మందికి ఒక్కొక్కరికి 1000 రూపాయల జరిమానా.. మొత్తం 77 మందికి జరిమానాలు విధించారు.

సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ లో డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన మందు బాబులకు పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ, ట్రాఫిక్ ఎస్.ఐ దిలీప్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి వారితో ఇంకెప్పుడు మద్యం సేవించి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేపించారు. ఈ సందర్భంగా సి.ఐ మాట్లాడుతూ.. ప్రతి రోజు పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు నిర్వహించాడం జరిగుతుందని, మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తుల పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి వారి తల్లితండ్రుల, లేదా కుటుంబ పెద్దల సమక్షంలో కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే భవిష్యత్తులో వచ్చే ఉద్యోగ అవకాశాలు కానీ, ఉపాధి అవకాశలకు పోలీస్ వెరిఫికేషన్ సమయంలో ఇబ్బందులు కలుగుతయని, ట్రాఫిక్, రోడ్ భద్రత నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# జూబ్లీహిల్స్‌లో బూత్ అవకతవకలు..

- ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆగ్రహం!

**బలగం టీవీ, హైదరాబాద్**



జూబ్లీహిల్స్ నియోజకవర్గం, షేక్‌పేట్ డివిజన్‌లోని డైమండ్ హిల్స్ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ ప్రాంతంలోని అల్ ఫలాహ్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన 66, 67 బూత్‌ల వద్ద తీవ్రమైన అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని, దీనికి పోలీసులు మౌనంగా సహకరిస్తున్నారని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆరోపించారు. స్థానిక ప్రజలు అందించిన సమాచారం మేరకు ఈ అవకతవకలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ మద్దతుదారులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని, బూత్ ఏజెంట్లను బెదిరిస్తున్నారని స్థానిక నాయకులు ఆరోపించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ, పోలీసులు సకాలంలో స్పందించకపోవడంతో స్థానిక నాయకులు మరియు దాసోజు శ్రవణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ, "పోలీసుల నిర్లక్ష్యం మరియు కాంగ్రెస్ మద్దతుదారుల దౌర్జన్యం కారణంగా ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగడం లేదు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. తక్షణమే ఈ అవకతవకలపై చర్యలు తీసుకోవాలి, లేనిపక్షంలో న్యాయం కోసం ఆందోళన చేస్తాం" అని హెచ్చరించారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులే ఇటువంటి అక్రమాలకు మద్దతుగా వ్యవహరించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక నాయకులు మరియు కార్యకర్తలు ఆయా బూత్‌ల వద్ద గుమిగూడి పోలీసుల తీరుపై నిరసన తెలియజేస్తున్నారు. ఈ ఘటనపై తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# విద్యతోనే మార్పు సాధ్యం..

- ప్రణాళిక ప్రకారం చదివి.. ఉన్నత స్థానాలకు ఎదగాలి..
- ఇంచార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్
- టీఎంఆర్ఈఐఎస్ విద్యాలయంలో ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు
- అలరించిన విద్యార్థుల నృత్యాలు..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

విద్యార్థినులు ప్రణాళిక ప్రకారం చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకల సందర్భంగా తంగళ్లపల్లి టీఎంఆర్ఈఐఎస్ విద్యాలయం మంగళవారం ఘనంగా నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు, బాలకార్మిక నిర్మూలన అంశాలపై ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఇంటర్ విద్యార్థులు ఏమి చదువుతున్నారు? తర్వాత ఏమి చదువుతారు? వారు ఆసక్తి ఏంటి? అని ఇంచార్జి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పలువురు టీచర్లకు ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ను నిర్వాహకులు సన్మానించారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిని నిత్యం తమ విద్యాలయంలోని లైబ్రరీలో బుక్స్, దిన పత్రికలు చదవాలని సూచించారు. సోషల్ మీడియా కు దూరంగా ఉండాలని, పుస్తకాలకు దగ్గరగా ఉండాలని పిలుపు ఇచ్చారు. విద్యార్థిని కుటుంబ నేపథ్యం ఎలా ఉన్నా సరే అత్యున్నత లక్ష్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. విద్యతోనే వ్యక్తిగత, సామాజిక మార్పు సాధ్యమని పేర్కొన్నారు. పలు ఉదాహరణలు వివరించారు. మంచిగా చదివే వారికే ఉన్నత అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. అన్ని తరగతుల సిలబస్ ఫిబ్రవరిలోగా పూర్తి చేయాలని, గత పది సంవత్సరాల బోర్డ్ పరీక్ష పేపర్స్ తీసుకొని, ఫైనల్ పరీక్ష వరకు సాధన చేయించాలని ఆదేశించారు. ఈ విద్యాలయం నుంచి విద్యార్థులు వచ్చే ఏడాది పలు జాతీయ విద్య సంస్థల్లో సీటు సాధించాలని ఆకాంక్షించారు.

ప్రతి విద్యార్థిని మంచిగా విద్యను అభ్యసించి టీచర్, లాయర్, ఇంజనీర్, డాక్టర్ తదితర వృత్తులు వివిధ ఉద్యోగాల్లో స్థిరపడాలని, ఆర్థికంగా స్వతంత్రత సాధించాలని సూచించారు. ఇష్టపడి చదివి.. ప్రతి సబ్జెక్టులో రాణించాలని, పోషకాహారం నిత్యం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి భారతి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, తహసీల్దార్ జయంత్, ప్రిన్సిపాల్ ఉర్సా ఫాతిమా. మైనార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి..

**నివాళులు అర్పించిన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



స్వాతంత్ర సమర యోధుడు, భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకల కార్యక్రమాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి ఇంచార్జి కలెక్టర్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య పోరాటంలో, దేశ విద్యా వ్యవస్థ నిర్మాణంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి భారతి, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక.. నాన్-లోకల్ కాంగ్రెస్ నేతలపై బీఆర్ఎస్ ఫిర్యాదు..

- ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి ఓటర్లను ప్రభావితం చేశారని ఆరోపణ..

**బలగం టీవీ, హైదరాబాద్**



జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల నిబంధనలను విరుద్ధంగా వ్యవహరించారని బీఆర్ఎస్ నేతల బృందం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కి ఫిర్యాదు చేసింది. నాన్-లోకల్ కాంగ్రెస్ నేతలు నియోజకవర్గంలో తిష్ట వేసి ఓటర్లను అక్రమంగా ప్రభావితం చేశారని బీఆర్ఎస్ బృందం ఆరోపించింది. ప్రభుత్వ విప్లుగా ఉన్న బీర్ల అయిలయ్య, రాంచంద్ర నాయక్, అలాగే ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌లు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారని బీఆర్ఎస్ నేతలు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి సంబంధించిన సాక్ష్యాలను సైతం వారు సీఈఓకు అందజేసి, వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. సీఈఓను కలిసిన బృందంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, టీజీఎస్పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్ర, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కె. కిషోర్ గౌడ్, బీఆర్ఎస్ మైనారిటీ నేతలు అర్షద్ అలీ ఖాన్, ఆజం అలీ తదితరులు ఉన్నారు.

# ఏటీసీతో ఉపాధి అవకాశాలు మెరుగు..

- మండేపల్లిలోని ఏటీసీ కేంద్రంలో పరిశీలన..
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)తో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. తంగళ్ళపల్లి మండలం మండేపల్లిలోని ఏటీసీ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఏటీసీలోని సీ ఎన్ సీ మ్యాచింగ్ టెక్నీషియన్, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్ టెక్నీషియన్, మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ టెక్నీషియన్, మెకానిక్ ఎలెక్ట్రిక్ వెహికల్, వర్చువల్ అనాలిసిస్ అండ్ డిజైనర్ ఎఫ్ఈఎం కోర్సుల్లో బాగంగా వివిధ యంత్రాలపై శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. ఎక్కడి నుంచి వస్తున్నారు? విద్య బోధన, ప్రాక్టికల్ అంశాలపై పలు ప్రశ్నలు అడిగి వివరాలు తెలుసుకున్నారు. మొత్తం ఎంత విద్యార్థులు చదువుతున్నారని ప్రిన్సిపాల్ ను అడగగా, 172 మంది విద్యార్థులకు గాను 166 మంది చదువుతున్నారని ఇంచార్జి కలెక్టర్ దృష్టికి ప్రిన్సిపాల్ తీసుకెళ్లారు. వివిధ కోర్సుల ల్యాబ్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. యువత ఏటీసీ సెంటర్లు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తరగతులకు వచ్చే విద్యార్థులు ప్రతి అంశాన్ని లోతుగా తెలుసుకోవాలని, ప్రాక్టికల్ ను కూడా నిత్యం సాధన చేయాలని సూచించారు. ఈ దశలో నేర్చుకున్న అంశాలు ఉద్యోగానికి, వృత్తి జీవితంలో ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి నిముషం విలువైనదని, తరగతులను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కవిత, తహసీల్దార్ జయంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రంజీ ట్రోఫీలో సంచలనం

- 65 ఏళ్లలో తొలిసారి ఢిల్లీపై

## జమ్ము-కశ్మీర్ ఘనవిజయం

బలగం టీవీ, హైదరాబాద్

రంజీ ట్రోఫీలో ఈ సీజన్ హెూరాహెూరీ పోరాటాలతో క్రీడాభిమానులను అలరిస్తోంది. ఇందులో భాగంగా జమ్ము-కశ్మీర్ జట్టు 65 ఏళ్లలో తొలిసారి మాజీ ఛాంపియన్ ఢిల్లీపై చారిత్రాత్మక విజయం సాధించి సంచలనం సృష్టించింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ప్రత్యర్థిని చిత్తు చేసిన జమ్ము జట్టు ఎలైట్ గ్రూప్ -డీలో రెండో స్థానానికి ఎగబాకింది. ఇదే మ్యాచ్‌లో మేఘాలయ బ్యాటర్ ఆకాశ్ కుమార్ చౌధరి అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీతో మరో విశేషాన్ని నమోదు చేశాడు.



మ్యాచ్ ప్రారంభం నుంచే జమ్ము%-%కశ్మీర్ బౌలర్లు ఆధిక్యాన్ని చాటారు. ఢిల్లీ తొలి ఇన్నింగ్స్‌ను అకీబ్ నబీ (5-35) దెబ్బతీయగా, బ్యాటర్లు కొంతసేపు ప్రతిఘటన చూపినా 211కే ఆలౌటయ్యారు. కెప్టెన్ అయుష్ బదోని (64), ఆయుష్ డొసెజా (65), సుమిత్ మథూర్ (55) అర్ధ శతకాలతో జట్టును కాపాడేందుకు ప్రయత్నించినా ముగింపులో అకీబ్ ముష్తాక్ (2-30) పెవిలియన్ బాట పట్టించాడు.

జమ్ము-కశ్మీర్ బ్యాటర్లు మొదటి ఇన్నింగ్స్‌లో దూకుడు కనబరిచారు. సారథి పరాస్ డోగ్రా (106), అబ్దుల్ సమద్ (85)ల మెరుపులతో జట్టు మూడు వందల మార్క్ దాటింది. రెండో ఇన్నింగ్స్‌లోనైనా భారీ స్కోర్ సాధించి ఆధిపత్యం చూపాలని ఢిల్లీ భావించినా, వన్షాజ్ శర్మ (6%-%68) వికెట్ వేటతో వారి ఆశలను తారుమారు చేశాడు. బదొని (72), డొసెజా (65) లాంటి కీలక బ్యాటర్లు పోరాడినా మిగతా బ్యాటర్లు విఫలమవడంతో ఢిల్లీ 277కే కుప్పకూలింది.

179 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జమ్ము%-%కశ్మీర్ శుభారంభం అందుకుంది. ఓపెనర్ కమ్రాన్ ఇక్బాల్ (133 నాటౌట్) ఢిల్లీ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ మ్యాచ్‌ను ఒంటి చేత్తో గెలిపించాడు. 20 ఫోర్లు, 3 సిక్సర్లతో రాణించిన కమ్రాన్ శతకం జమ్ము విజయంలో ప్రధాన భూమిక పోషించింది. ఢిల్లీ బౌలర్లు అతడిని ఔట్ చేయడానికి ఎంత కృషి చేసినా అతడు క్రీజులోనే నిలిచిపోయి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. దశాబ్దాల కలను నిజం చేసిన ఈ విజయం జమ్ము%-%కశ్మీర్ జట్టుకు రంజీ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.

# డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం సౌతాఫ్రికా సిరీస్ కీలకం

- మహమ్మద్ సిరాజ్

బలగం టీవీ, హైదరాబాద్




వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (2025-27) సైకిల్‌లో ఫైనల్ బెర్త్ దక్కాలంటే సొంత గడ్డపై సౌతాఫ్రికాతో జరిగే రెండు టెస్ట్‌ల సిరీస్‌లో తప్పనిసరిగా విజయం సాధించాల్సిందేనని టీమిండియా పేసర్ మహమ్మద్ సిరాజ్ అన్నారు. డిఫెండింగ్ ఛాంపియన్ అయిన సౌతాఫ్రికాను ఓడిస్తే పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానానికి చేరే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అభిప్రాయపడ్డాడు. ప్రస్తుత డబ్ల్యూటీసీ సైకిల్‌లో టీమిండియా డ్రాతో ప్రారంభించింది. ఇంగ్లండ్ పర్యటనలో ఐదు టెస్ట్‌ల సిరీస్‌ను 2-2తో డ్రా చేసుకున్న భారత్, అనంతరం వెస్టిండీస్‌పై 2-0తో గెలుపొందింది. ప్రస్తుతానికి 61.5 శాతం విన్నింగ్ పర్సెంటేజ్‌తో మూడో స్థానంలో కొనసాగుతోంది. ఆస్ట్రేలియా, శ్రీలంక టాప్-2లో ఉన్నాయి.

గత సైకిల్‌లో భారత్ త్రుటిలో ఫైనల్ అవకాశాన్ని కోల్పోయింది. అగ్రస్థానంలో నిలిచినా ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా ఫైనల్‌కు చేరగా.. విజేతగా సౌతాఫ్రికా నిలిచింది. నవంబర్ 14 నుంచి ప్రారంభం కానున్న ఈ సైకిల్ అత్యంత కీలక సిరీస్‌లో మొదటి టెస్ట్‌ను కోల్‌కతా ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సిరీస్‌కు ముందు పాకిస్థాన్ పర్యటనలో సౌతాఫ్రికా 1%-%1తో సిరీస్‌ను సమం చేసింది. సౌతాఫ్రికా సిరీస్ నేపథ్యంలో అధికారిక బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడిన సిరాజ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. లిలి"ఈ డబ్ల్యూటీసీ సైకిల్‌కు ఈ సిరీస్ ఎంతో కీలకం. సౌతాఫ్రికా డిఫెండింగ్ ఛాంపియన్ కాబట్టి ఆ జట్టుని ఓడించడం ఫైనల్ అవకాశాలను మరింత బలపరుస్తుంది. మా ఫామ్‌పై మాకు నమ్మకం ఉంది. ఇంగ్లండ్‌లో మెరుగైన ప్రదర్శన చేశాం, వెస్టిండీస్‌పై గెలిచాం. వ్యక్తిగతంగా కూడా మంచి లయలో ఉన్నాను. బలమైన జట్టుతో ఆడితే నేర్చుకోవాల్సింది చాలా ఉంటుంది. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను"లిలి అని సిరాజ్ పేర్కొన్నాడు. ఈ సైకిల్‌లో సిరాజ్ అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటివరకు 7 మ్యాచ్‌లు ఆడి 26.54 సగటుతో 33 వికెట్లు తీసి జట్టుకు కీలకమైన సేవలు అందిస్తున్నాడు.

# ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులో సీఐడీ ఎదుట హాజరైన విజయ్ దేవరకొండ

బలగం టీవీ, హైదరాబాద్



ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో టాలీవుడ్ నటుడు విజయ్ దేవరకొండ మంగళవారం సీఐడీ విచారణకు హాజరయ్యారు. ఆయన నుండి స్టేట్మెంట్‌ను సీఐడీ అధికారులు రికార్డ్ చేశారు. పంజాగుట్ట, మియాపూర్, సైబరాబాద్ పోలీస్ స్టేషన్లలో నమోదైన ఆన్‌లైన్ బెట్టింగ్ ఎఫ్ఐఆర్‌లు సీఐడీకి బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా బెట్టింగ్, గేమింగ్ యాప్ ప్రమోషన్ చేసినందుకు సీఐడీ విజయ్‌కు నోటీసులు జారీ చేసింది. ఇంతకుముందు ఇదే కేసులో ఆగస్టు 6న ఈడీ కూడా విజయ్‌ను విచారించింది. ఏ23 గేమింగ్ యాప్‌ను ప్రమోట్ చేసిన నేపథ్యంలో ఈడీ, సీఐడీ రెండూ నటుడిని ప్రశ్నించాయి. విచారణలో భాగంగా ఏ23 కంపెనీతో చేసుకున్న అగ్రిమెంట్ వివరాలను విజయ్ సీఐడీకి అందజేశారు. తాను ప్రమోట్ చేసిన యాప్ తెలంగాణలో ఓపెన్ కాకపోవడం కూడా తెలిపినట్లు సమాచారం. ఇకపై ఎలాంటి గేమింగ్, బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయబోనని విజయ్ దేవరకొండ సీఐడీకి హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

# అల్లరి నరేష్ థ్రిల్లర్ '12 ఏ రైల్వే కాలనీ' ట్రైలర్ విడుదల




బలగం టీవీ, హైదరాబాద్


టాలీవుడ్ నటుడు అల్లరి నరేష్ ప్రధాన పాత్రలో నటించిన తాజా థ్రిల్లర్ చిత్రం '12%ూ% రైల్వే కాలనీ' విడుదలకు సిద్ధమైంది. నాని కాసరగడ్డ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కగా, 'శ్రీనివాస సిల్వర్ స్క్రీన్' బ్యానర్‌పై శ్రీనివాస్ చిట్టూరి నిర్మించారు. డాక్టర్ కామాక్షి భాస్కర్ల కథానాయికగా నటిస్తున్నారు.

'పొలిమేర', 'పొలిమేర 2' చిత్రాల దర్శకుడు డాక్టర్ అనిల్ విశ్వనాథ్ ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందించడమే కాకుండా షోరన్నర్‌గా వ్యవహరించారు. నవంబర్ 21న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను చిత్ర బృందం తాజాగా విడుదల చేసింది.

సినిమాలో సాయికుమార్, వైవా హర్ష, గెటప్ శ్రీను, సద్దాం, గగన్ విహారి, అనిష్ కురువిల్లా, మధుమణి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు. థ్రిల్లర్ జానర్‌లో అల్లరి నరేష్ నటన మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశం ఉందని చిత్ర యూనిట్ ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

# నిలకడగా ధర్మేంద్ర ఆరోగ్యం

బలగం టీవీ, హైదరాబాద్



ప్రముఖ నటుడు ధర్మేంద్ర ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. ఆయన చికిత్సకు సత్ఫలితాలు కనిపిస్తున్నాయని తెలిపారు. సోషల్ మీడియాలో ధర్మేంద్ర మరణించారంటూ విస్తరిస్తున్న తప్పుడు వార్తలను కుటుంబ సభ్యులు తీవ్రంగా ఖండించారు. ధర్మేంద్ర త్వరగా కోలుకోవాలని ప్రార్థించాలని, కుటుంబ గోప్యతను గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. ధర్మేంద్ర ఆరోగ్యంపై స్పష్టతనిచ్చిన సన్నీ డియోల్ టీమ్ "ఆయన కోలుకుంటున్నారు. చికిత్సకు బాగా స్పందిస్తున్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో దీర్ఘాయుష్షుతో ఉండాలని మనమందరం కోరుకుందాం" అని ఒక ప్రకటనలో తెలిపింది. ధర్మేంద్ర పరిస్థితిపై అనధికారిక సమాచారం ప్రసారం చేయవద్దని వారి బృందం పునరుద్ఘాటించింది.

ఇదివరకు సోషల్ మీడియాలో ధర్మేంద్ర మరణించారన్న పుకార్లు వైరల్ అయ్యాయి. కొన్ని ప్రముఖులు, నేతలు కూడా ఈ వదంతులను నిజమని నమ్మి సంతాప సందేశాలు పోస్టు చేశారు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే స్పందించి, అపోహలకు చెక్ పెట్టారు. ఈ తప్పుడు ప్రచారంపై ధర్మేంద్ర సతీమణి హేమమాలిని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇది క్షమించరాని పని. చికిత్స పొందుతున్న వ్యక్తి గురించి ఈ రీతిగా తప్పుడు వార్తలు ప్రసారం చేయడం బాధ్యతారాహిత్యం. కుటుంబ గోప్యతకు గౌరవం ఇవ్వాలి" అని ఆమె సోషల్ మీడియాలో పేర్కొన్నారు.ధర్మేంద్ర కుమార్తె ఈషా డియోల్ కూడా స్పందిస్తూ తన తండ్రి క్షేమంగా ఉండి కోలుకుంటున్నారని స్పష్టం చేశారు. మీడియా అత్యుత్సాహంతో తప్పుడు వార్తలు ప్రచారం చేయడం తప్పు అని పేర్కొంటూ, ఆయన త్వరగా కోలుకోవాలని కోరుతున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# నిర్మాత బెల్లంకొండ సురేష్‌పై కబ్జా కేసు

బలగం టీవీ, హైదరాబాద్



టాలీవుడ్ ప్రముఖ నిర్మాత బెల్లంకొండ సురేష్ మళ్లీ వార్తల్లో నిలిచారు. ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆయనపై కబ్జా కేసు నమోదైంది. ఫిల్మ్‌నగర్ రోడ్ నంబర్ 7లో ఉన్న తన ఇంటిని బెల్లంకొండ సురేష్ అనుచరులు అక్రమంగా ఆక్రమించారని శివ ప్రసాద్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. తాను కొంతకాలంగా బంధువుల వద్ద ఉంటుండగా, ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించారనే ఆరోపణలు ఆయన చేశారు.

శివ ప్రసాద్ ఫిర్యాదులో ప్రకారం, ఇంటిలోని సామగ్రిని ధ్వంసం చేయడంతో పాటు గోడలకు కూడా నష్టం జరిగిందని తెలిపారు. తిరిగి ఇంటికి చేరుకున్నప్పుడు పరిస్థితి చూసి షాక్‌కు గురయ్యానని పేర్కొన్నారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు సెక్షన్లు 329(4), 324(5), 351(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై మాట్లాడేందుకు శివ ప్రసాద్ సిబ్బంది బెల్లంకొండ సురేష్ ఇంటికి వెళ్లినప్పుడు వాగ్వాదం, దాడి ప్రయత్నం జరిగినట్లు సమాచారం.

బెల్లంకొండ సురేష్ వైపు నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. ఈ ఘటన ఫిల్మ్‌నగర్‌తో పాటు టాలీవుడ్ వర్గాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. 'ఆది', 'కందిరీగ', 'బాడీగార్డ్', 'చెన్నకేశవరెడ్డి', 'రభస', 'అల్లుడు శ్రీను' వంటి హిట్ చిత్రాలతో నిర్మాతగా పెద్ద పేరు తెచ్చుకున్న ఆయన, గత కొన్నేళ్లుగా నిర్మాణానికి దూరంగా ఉన్నారు. అయితే బెల్లంకొండ కుటుంబం సినీ రంగంలో కొనసాగుతూనే ఉంది. పెద్ద కుమారుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా పలు చిత్రాల్లో నటిస్తుండగా, చిన్న కుమారుడు బెల్లంకొండ గణేష్ 'స్వాతిముత్యం' ద్వారా హీరోగా ఎంట్రీ ఇచ్చాడు. ప్రస్తుతం బెల్లంకొండ సురేష్‌పై నమోదైన కేసు ఫిల్మ్‌నగర్‌లో హాట్‌టాపిక్‌గా మారగా, ఆయన స్పందన కోసం సినీ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.



# కీర్తి సురేశ్ ప్రధాన పాత్రలో 'రివాల్వర్ రీటా'

- నవంబర్ 28న విడుదల

బలగం టీవీ, హైదరాబాద్

వివిధ పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ దూసుకుపోతున్న అగ్ర కథానాయిక కీర్తి సురేశ్ నటించిన తాజా చిత్రం 'రివాల్వర్ రీటా' విడుదల తేదీ ఖరారైంది. కె. చంద్రు దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో సీనియర్ నటి రాధికా శరత్‌కుమార్ కీలక పాత్రలో నటిస్తున్నారు. షఉటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 28న విడుదల కానుందని చిత్ర బృందం ప్రకటించింది. సినిమాలో కీర్తి సురేశ్ 'రీటా' అనే మధ్యతరగతి యువతి పాత్రలో కనిపించనున్నారు. అనూహ్య పరిణామాల నేపథ్యంలో ఆమె చేతిలో రివాల్వర్ పడటంతో కథ మలుపుతిరుగుతుంది. అనంతరం ఆమె ఎదుర్కొన్న సంఘటనలు, సవాళ్లే కథకు ఆసక్తిని జతచేస్తాయి. కామెడీ, యాక్షన్ అంశాలతో తెరకెక్కిన ఈ చిత్రం థ్రిల్లర్ జానర్‌లో వినూత్న అనుభూతిని అందించనున్నట్లు మేకర్స్ చెబుతున్నారు.

# 'సంతాన ప్రాప్తిరస్తు' ట్రైలర్‌కు ప్రేక్షకుల భారీ స్పందన

బలగం టీవీ, హైదరాబాద్

విక్రాంత్, చాందిని చౌదరి జంటగా నటించిన 'సంతాన ప్రాప్తిరస్తు' చిత్ర ట్రైలర్ విడుదలైన ఐదు రోజుల్లోనే 3.4 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించింది. నవంబర్ 6న విడుదలైన ఈ ట్రైలర్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచి మంచి హైప్ క్రియేట్ చేసింది. ఆధునిక సమాజంలో పెరుగుతున్న సంతానలేమి సమస్యను కథగా తీసుకుని, వినోదం-భావోద్వేగాలతో మేళవించి ఈ చిత్రాన్ని రూపొందించినట్లు ట్రైలర్ సూచిస్తోంది. సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్లపై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. సంగీతం సునీల్ కశ్యప్ అందించారు. తరుణ్ భాస్కర్, వెన్నల కిశోర్, అభినవ్ గోమటం, మురళీధర్ గౌడ్, తాగుబోతు రమేశ్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. షేక్ దావూద్ జీ స్క్రీన్‌ప్లే అందించగా, సంభాషణలు కల్యాణ్ రాఘవ్ రాశారు.